క్లుప్తంగా

క్రిస్మస్ కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జేఎంబీ చర్చి నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: క్రిస్మస్ పండుగ సందర్భంగా స్థానిక జేఎంబీ చర్చ్ సంఘ కాపరి తేళ్ల జాన్ కెనడీ ఆధ్వర్యంలో క్రిస్మస్ నెల కార్యక్రమాల వివరాలు తెలిపే కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 25 నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలు, ఆరాధన కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. సంఘస్తులు, క్రైస్తవులు ఈ నెల రోజుల పాటు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని క్రీస్తు రాకడను ఘనంగా స్తుతించాలని కోరారు. ఏసుక్రీస్తు రాకడ పరమార్థాన్ని అర్థం చేసుకుని వేడుకల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ జి.పద్మజ్యోతి, కార్యదర్శి యాదాల రాజశేఖర్, ట్రెజరర్ జి. జగ్జీవన్‌రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడి పూజ


అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న స్వాములు

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో సాయి యువసేన ఆధ్వర్యంలో శివగురుస్వామి భజన బృందం వారు అయ్యప్ప స్వామి అఖండ పడిపూజను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారి మండపాన్ని చక్కగా అలంకరించి గణపతి, అయ్యప్ప, సుబ్రహ్మణ్యస్వామి మూలమూర్తులకు పూజాక్రతువులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప స్వామి పడిపూజలో అన్నిరకాల మాలధారులు పాల్గొని భజన చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, అల్పాహారం స్వీకరించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి చెంచలరావు, శివగురు స్వామి, మాలధారులు పాల్గొన్నారు.

కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు

మద్దిపాడు: కమ్మ సోదరులు అన్ని రంగాల్లో రాణిస్తూ ఔన్నత్యాన్ని చాటుకోవాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మద్దిపాడు మండలంలోని వెంకటరాజుపాలెం గ్రామంలో జాతీయ రహదారి పక్కనున్న హైవే సిటీ గ్రేటర్ కమ్యూనిటీ వెంచర్లో కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. మండవ మురళీకృష్ణ అధ్యక్షత వహించగా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్యేలు బాచిన చెంచు గరటయ్య, అచ్యుత్ కుమార్, వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవికుమార్, కామేపల్లి శ్రీనివాసరావు, రావుల పద్మ, కామేపల్లి శ్రీనివాసరావు, మండవ సుబ్బారావు, పాల్గొన్నారు.



నార్త్‌బైపాస్ కూడలిలో కర్నూలు రోడ్డుపై గుంతలు



రామ్‌నగర్ 1వ లైన్‌లో లోతైన గుంతల్లో చేరిన నీరు


రైల్వేస్టేషన్ వద్ద కట్ అయిన రోడ్డు


సంతపేట రాఘవేంద్రస్వామి ఆలయ సమీపంలో...


భాగ్యనగర్ 4వ లైన్ ఎదురుగా రోడ్డుపై పడిన గుంతలు

అతుకులు.. గతుకులు..!

ఒంగోలు నగరంలోని రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. ఏ రోడ్డు చూసినా ఎక్కడో ఒకచోట గుంత పడి వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయి. పలు కాలనీల్లోని అంతర్గత రోడ్లతో పాటు నిత్యం వందలాది వాహనాలు తిరిగే ప్రధాన రోడ్లపై సైతం గుంతలు పడినప్పటికీ నగరపాలక సంస్థ అధికారులు మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గుంతల్లో వాహనాలు పడి వీల్ బెండ్, ఫోర్క్ బెండ్ రావడంతో పాటు షాకబ్ జర్స్, బేరింగులు, టైర్లు పాడవుతున్నాయి. వాహనాలు చెడిపోవడమే కాకుండా వాహనదారులకు వెన్నెముక సమస్యలు వస్తున్నాయి. డిస్క్ సమస్యలు తలెత్తి నడుం నొప్పులతో నగర వాసులు నరకం చూస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై గుంతలు పెద్దవిగా మారి సమస్య తీవ్రత మరింత పెరిగింది. కొన్నిచోట్ల తూతూమంత్రంగా మరమ్మతులు చేపట్టి అతుకులు వేసినప్పటికీ.. గతుకులు మాత్రం అలాగే ఉంటున్నాయి. వర్షం కురిసిన వెంటనే అతుకులు వేసిన ప్రాంతంలో మళ్లీ గోతులు పడుతున్నాయి. వర్షం కురవకపోయినా నెలరోజుల్లోపే మళ్లీ గుంతలు పడుతున్నాయంటే.. నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పనితీరు ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికితోడు నగరంలో అనేకచోట్ల రెండు రోడ్లు కలిసే ప్రాంతంలో, డివైడర్ల మధ్యలో ఒకటీరెండు అడుగులు ఖాళీ వదలడంతో అవన్నీ గుంతలుగా మారి వాహనదారులు అవస్థపడుతున్నారు. గుంతల వద్ద వీధి లైట్లు లేకుంటే రాత్రివేళల్లో కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు, పాలకులు స్పందించి నగరంలోని రోడ్లపై గుంతలు పూడ్చి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. - ఒంగోలు వన్‌టౌన్


కర్నూలు రోడ్డులో పవర్ ఆఫీస్ ఎదురుగా...


నెల్లూరు బస్టాండ్ వద్ద డివైడర్ మధ్యలో ఏర్పడిన గుంతలు


సంతపేటలో పంచాయతీరాజ్ కార్యాలయం ఎదురుగా...


రాంనగర్ 10వ లైన్ వద్ద బలాల్ హోటల్ ఎదురుగా...

రేపు మహాధర్నాను జయప్రదం చేయండి

నాగులుప్పలపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా అఖిలపక్ష టీయూ సంయుక్త కిసాన్ మోర్చా రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ ఒంగోలులో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. ఆదివారం మండలంలోని అమ్మనబ్రోలు, చీర్వానుప్పలపాడు తదితర గ్రామాల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా కన్వీనరు చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా బీజేపీ విధానాల్లో ఎటువంటి మార్పులేదన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిలో ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలతో కూడిన ప్రభుత్వం కూడా అవే విధానాలను రాష్ట్రంలో అమలుచేస్తోందన్నారు. ఆయా విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. సర్వ సంపదను సృష్టించేది కార్మికవర్గం అయితే.. దేశప్రజలకు తిండి పెట్టేది రైతాంగమని అన్నారు. కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి సమస్యలను పరిష్కరించకుండా కార్పొరేట్లు, పెట్టుబడిదారుల కోసం పనిచేస్తున్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం గత 10 సంవత్సరాల కాలంలో 19.28 లక్షల కోట్ల రూపాయల రుణ మాఫీ, పన్నురాయితీని కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు కల్పించిందన్నారు. కానీ, రైతులకు మాత్రం ఒక్కసారి కూడా రుణమాఫీ చేయడానికి చేతులురావడం లేదని విమర్శించారు. కార్మికులకు రూ.26 వేల కనీసం వేతనం అమలు చేయడం లేదన్నారు ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించి రైతులకు స్వామినాథన్ కమిషన్ ప్రకారం మద్దతు ధర అమలుచేయాలని, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు ఒకే పర్యాయం పంట రుణాలు రద్దుచేయాలని, కేరళ రాష్ట్రంలో మాదిరిగా రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంట్లో పెట్టి అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ఉపాధి హామీ పనిదినాలు 200 రోజులకు పెంచి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని, జామాయిల్, సుబాబుల్ రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. దుర్మార్గమైన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. డిమాండ్ల సాధన కోసం జరిగే ధర్నాలో రైతులు, కార్మికులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు, కౌలు రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్కే మాబు, చుండూరి శ్రీరామ్మూర్తి ,టి.శ్రీకాంత్, రావెళ్ల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చుండూరి రంగారావు

కార్యకర్తలు ఐక్యంగా ఉండాలి


చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చుండూరి రవి దృష్టికి సమస్యలు తీసుకెళ్తున్న గోపాల్‌రెడ్డి

- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జి చుండూరి రవి

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఐక్యంగా ఉండాలని ఆ పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జి చుండూరి రవి పిలుపునిచ్చారు. కొత్తపట్నం మండలంలోని ఈతముక్కల గ్రామంలో ఆదివారం మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి పలు విషయాలపై చర్చించారు. పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలంటే అందరూ కష్టపడి చేయాలని ఆదేశించారు. పార్టీ విషయాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చెవిరెడ్డి, చుండూరి దృష్టికి గోపాల్‌రెడ్డి తీసుకెళ్లారు. ఈతముక్కల, మడనూరు గ్రామాల్లో రొయ్యలు సాగుచేస్తారని, నీటి వసతి లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రత్యామ్నాయ మార్గం చూపాలని కోరారు. అల్లూరు ఇరిగేషన్ చెరువులో చేరిన వర్షం నీటిని బయటకు వదిలేస్తున్నారని, ఆ నీటిని భద్రపరిస్తే వేసవిలో పశువులకు, రొయ్యల చెరువులకు ఉపయోగం ఉంటుందని, పంటలు బాగా పండుతాయని తెలిపారు. అనంతరం కార్యకర్తలతో సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్, వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, నాయకులు సామంతుల నాగిరెడ్డి, మాకాని వెంకటేశ్వర్లు, పార్టీ గ్రామ అధ్యక్షుడు అడిగోపుల లక్ష్మీనారాయణ, షేక్ బాజీ, స్వర్ణ సుబ్బారావు, బండారు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన చెవిరెడ్డి, చుండూరి


రవీంద్రరెడ్డి కుమార్తె రమ్యశ్రీని ఆశీర్వదిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చుండూరి రవి, లంకపోతు అంజిరెడ్డి, పార్టీ నాయకులు

కొత్తపట్నం: జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్, ఈతముక్కల ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల రవీంద్రరెడ్డి, నాగలక్ష్మి కుమార్తె ఆళ్ల రమ్యశ్రీకి భవనం అచ్యుత్‌రెడ్డితో గత నెల 27వ తేదీ వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో ఆదివారం జిల్లాకు వచ్చిన వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి, తదితరులు ఆదివారం రవీంద్రరెడ్డి నివాసానికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు. వివాహ శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీశారద, వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్, సామంతుల వీరారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కేశవరపు కోటిరెడ్డి, సైకం రాంబాబు, సచివాలయ కన్వీనర్ తుమ్మా పుల్లయ్య తదితరులు ఉన్నారు.

వ్యక్తిత్వాన్ని పెంపొందించేందుకు పుస్తకాలు దోహదం

ఒంగోలు టౌన్: పుస్తకాలు వ్యక్తిత్వాన్ని పెంపొందిస్తాయని, మంచి నడవడికను అలవాటు చేస్తాయని కవి, ఉపాధ్యాయుడు జాలాది మోహన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పుస్తకాలు పిల్లల్లో మంచి ఆలోచనలు కలగజేస్తాయని, ప్రపంచ జ్ఞానాన్ని బోధిస్తాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు తీసుకెళ్లి పుస్తకాలు చదవడం అలవాటు చేయాలని సూచించారు. అనంతరం చిన్నారులకు కథలు చెప్పారు. పిల్లలతో కథలు చెప్పించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కె.సంపూర్ణమ్మ, డి.సందీప్, ఇమ్మానియేలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న జాలాది మోహన్

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


షేక్ అక్బర్


చలువాది శ్రీనివాసరావు

చీమకుర్తి: యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం చీమకుర్తి మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా షేక్ అక్బర్, ప్రధాన కార్యదర్శిగా చలువాది శ్రీనివాసరావును ఎన్నుకున్నట్లు తెలిపారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు ఒంగోలులో జరుగుతున్న నేపథ్యంలో చీమకుర్తి మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు వెల్లడించారు. గౌరవ అధ్యక్షునిగా మన్నం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షునిగా గుద్దంటి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా పర్వతం వెంకటేశ్వర్లు, సహాధ్యక్షురాలిగా ఎస్‌ఎల్ శివపార్వతిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా నల్లూరి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులను ఉపాధ్యాయులు అభినందించారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం

ఒంగోలు మెట్రో: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఒంగోలు లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో షిరిడీ సాయి కల్చరల్ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం చండీహోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం దత్త మందిరం ప్రాంగణంలో బ్రహ్మశ్రీ నేలంబొట్ల సదాశివశర్మ ఆధ్వర్యంలో వేద పురోహితులు రాజేష్‌శర్మ, దుర్గాప్రసాద్, నవీన్ చండీయాగంలో పద్నాలుగు మంది దంపతులచే భక్తిశ్రద్ధలతో యాగ క్రతువులు నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు వెయ్యి మందికి అన్నసంతర్పణ చేశారు.


సామూహిక చండీయాగంలో పాల్గొన్న దంపతులు

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి


యువకుని మృతదేహం

ఒంగోలు టౌన్: వేగంగా వెళుతున్న రైలు నుంచి జారి పడి ఒక గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆదివారం ఉదయం సూరారెడ్డి పాలెం, టంగుటూరు రైల్వే స్టేషన్ల మధ్య నెల్లూరు వైపు వెళుతున్న రైలు నుంచి ఒక యువకుడు జారి పడి మరణించాడు. మృతుడు నీలం రంగు చొక్కా, నీలం రంగు జీన్స్ ధరించి ఉన్నాడు. ఇతర ఆధారాలు ఏమీ లభించలేదు. వివరాలు తెలిసిన వారు 9440627647 కు ఫోన్ ద్వారా తెలియజేయగలరని జీపీఆర్ ఎస్ఐ అరుణ కుమారి తెలిపారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

సంతనూతలపాడు: పారిశ్రామికవేత్త, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ కోశాధికారి శిద్దా సూర్యప్రకాష్‌రావు, జయశ్రీ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా సంతనూతలపాడులోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వాసవీ క్లబ్, వాసవీ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధులు వేమూరి నాగేంద్ర ప్రసాదరావు, గ్రంధి లక్ష్మీప్రసాదరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు వేమూరి వెంకట శేషారావు, సెక్రటరీ చలువాది రాము, వాసవీ మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి, సెక్రటరీ శిఘాకొల్లి జయశ్రీ, వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు గ్రంధి బదరీ నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

నాగులుప్పలపాడు: మండలంలోని నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ట్రూప్ 637 ఆఫీసర్ నన్నెబోయిన వెంకటప్పయ్య అధ్వర్యంలో 76వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ చంద్రశేఖర్, 34 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మోహన్, లెఫ్టినెంట్ కల్నల్ కె.సత్యనారాయణ ఆదేశాల మేరకు, సుబేదార్ మేజర్ పుష్పరాజ్ సూచన మేరకు నిర్వహించిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయుడు షేక్ లాల్ సాహెబ్ పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణకు నిలువెత్తు నిదర్శనం నేషనల్ క్యాడెట్ కార్ప్స్ అని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో పలు రకాల మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ వెంకటప్పయ్య మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థుల క్రమశిక్షణ, కర్తవ్యదీక్ష, నిస్వార్థ సేవలే వారి ప్రత్యేకతను చాటుతాయన్నారు. సమాజంలో వారికి గౌరవాన్ని, గుర్తింపును ఇస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను నిలిపేయాల్సిందే

ఒంగోలు టౌన్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని, ప్రజలపై విద్యుత్ చార్జీల భారం వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ, పౌర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఎల్బీజీ భవనంలో నిర్వహించిన రౌండ్ టేబుల్‌కు మారెళ్ల సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కుల సంఘాల సమైఖ్య కన్వీనర్ జి.రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పంపిణీ సంస్థల అసమర్థ విధానాల వలన నష్టాలు వస్తున్నాయని, ఈ నష్టాలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో భాగంగానే స్మార్ట్ మీటర్ల భారాలు ప్రజల మీద పడుతున్నాయని చెప్పారు. ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు ఏపీ పుల్లారావు, సీఐటీయూ నాయకులు చీకటి శ్రీనివాసరావు, ఎస్‌డీ హుసేన్, తంబి శ్రీనివాసరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేవతా శ్రీరాములు, ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ కార్యదర్శి ఓగిరాల రాధాకృష్ణ మూర్తి, నాయకులు దామా శ్రీనివాసులు, భక్త్ సింగ్ రాజు, అంజిరెడ్డి, విశ్వసేన్, ముసలారెడ్డి, ఎండీ యాసిన్, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఉదయ భాస్కర్, సుబ్బయ్య పాల్గొన్నారు.

సాయిబాబా మందిరం కూల్చివేతపై ఫిర్యాదు

చీమకుర్తి: స్థానిక ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ పరిధిలో ఉన్న సాయిబాబా మందిరాన్ని కూల్చివేశారని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ వీవీ శివారెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలేజీ స్థలం యజమాని ఇలవల సుధాకర్‌రెడ్డి వద్ద లీజుకు తీసుకున్న గడువు 2030 వరకు ఉన్నప్పటికీ కాలేజీ పరిధిలో ఉన్న సాయిబాబా మందిరాన్ని పడేశారని శివారెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును పరిశీలిస్తున్నట్లు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు.


కూల్చివేసిన సాయిబాబా మందిరం